# సమస్యల వలయంలో మోత్కూర్ గ్రామం



ఐదో వార్డులో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

- రోడ్డుపైనే పారుతున్న మురుగు నీరు
- సరిపడారాని మిషన్ భగీరథ నీళ్లు

దోమ, ఏప్రిల్ 7 : మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలోని ఐదో వార్డులో కొంత కాలంగా మురుగు నీటి కాలువ సమస్య తలెత్తి కాలనీ వాసులకు ఇబ్బందిగా మారింది. వార్డులోని రోడ్డు పక్కన సైడ్‌డ్రైన్ గాని అండర్ డ్రైనేజీగాని లేదు.అంతకు ముందు పక్కనే ఉన్న పానాదీ గుండా నీరు వెళ్లేది. అక్కడ కొందరు వ్యక్తులు మా ప్లాట్లు ఉన్నాయని కాలువను మూసివేయగా అక్కడే మిగిలి ఉన్న కొంత భూమిలో మూడు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి మురుగు నీరు దాట్లోకి వెళ్లే విదంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. పారిశుధ్య కార్మికులతో ప్రతి రోజు చెత్త సేకరణ ట్రాక్టర్‌ను గ్రామం మొత్తం తిప్పినా కొంతమంది గ్రామస్తులు చెత్తను రోడ్ల పక్కనే వేస్తున్నారు. అదే చెత్తను బుట్టల్లో వేసి ఉంచి చెత్త బండి వచ్చినప్పుడే వేస్తే సమస్య ఉండదని పంచాయితీ కార్యదర్శి రవిందర్‌రెడ్డి ప్రజలను కోరుతున్నారు. మిషన్ భగీరథ తాగు నీరు ఒక రోజు వచ్చి మరొక రోజు రాకపోవడమే కాకుండా గ్రామానికి సరిపడినంత తాగు నీరు రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగు నీటిని ఎక్కువగా వదలాలని గ్రామంలోని సమస్యలను త్వరలో పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన గల డబ్బాల వెనక భాగంలో చెత్తాచెదారం

**మురుగు నీటి సమస్య పరిష్కరించాలి**



మురుగు నీరు ఇండ్ల ముందు, రోడ్డుపై పారడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు సమస్యను పరిష్కరిస్తా మని చెప్పి వారం రోజులు గడుస్తున్నది. ఇప్పటికీ సమస్యను పరిష్కరించలేదు. కంపు వాసనతో ఇండ్లల్లో ఉండలేకపోతున్నాం దయ చేసి అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– సీత్వ లక్ష్మి , మోత్కూర్, దోమ మండలం

**మిషన్ భగీరథ నీరు పెంచాలి**



గ్రామానికి ఎప్పటికీ వదిలే మిషన్ భగీరథ తాగు నీటిని కొంత మేర పెంచి వదిలి నట్లయితే తాగు నీటి సమస్య తీరుతుంది. లేదంటే తాగు నీటి కోసం బిందెలతో పొలాల దగ్గరకు వెళ్లే పరిస్థితి వస్తుంది కావున సంబందిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని తాగు నీటి కొరతను తీర్చాలి...

– సంపల్లి మల్లేశ్, మోత్కూర్ గ్రామం, దోమ

**మిషన్ భగీరథ నీరు పెంచాలి**



రోడ్డుపై మురుగు నీరు పారుతున్న విషయంపై గ్రామ పంచాయితీ కార్యదర్శి రవీందర్‌రెడ్డిని వివరణ కోరగా గ్రామం లోని 5వ వార్డులో రోడ్డుపై పారుతున్న మురుగు నీటి సమస్యను తీర్చడానికి మూడు ఇంకుడు గుంతలను తవ్వించే పని కొనసాగుతున్నది. రెండుమూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం

-రవీందర్‌రెడ్డి గ్రామ పంచాయితీ కార్యదర్శి

## సామాజిక సేవా కార్యక్రమాలతో గుర్తింపు



ఆర్యవైశ్య సంఘం వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 7: సామాజిక సేవా కార్యక్రమాలతో మంచి గుర్తింపు లభిస్తుందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. సోమవారం పరిగిలో జరిగిన ఆర్యవైశ్య సంఘం ఎనిమిదో వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సమాజ సేవా కార్యక్రమాలలో ముందుంటారని చెప్పారు. సమజహితం కోరుతూ చేపట్టే పనులతో మంచి పేరు వస్తుందన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని ఆర్యవైశ్య సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ జెడ్పీటీసీ మేఘమాల, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, సీనియర్ నాయకులు బి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఎదిరె క్రిష్ణ, వేముల కిరణ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు సోమ రమేశ్, ఆకారపు రాజు, పాలాది వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ



బొంరాస్‌పేట్, ఏప్రిల్ 7 : దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులను విద్యాధికారి విజయరామరావు అందించారు. పాఠశాలలో ఏడో తరగతి పరీక్షలు రాస్తున్న 19 మంది అల్లిఖాన్‌పల్లి గ్రామానికి చెందిన విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లతోపాటు పెన్నులను సోమవారం అందించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. గురుకుల ప్రవేశ పరీక్షలో పాఠశాలలో చదవుతున్న నలుగురు విద్యార్థులు 5వ తరగతిలో ప్రవేశాల కోసం ఉత్తీర్ణులయ్యారు. కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, మల్లప్ప, రమేశ్,ఆశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సేవలకు గుర్తింపుగా ఉగాది పురస్కారం



పురస్కారాన్ని అందుకొంటున్న విశ్రాంత ఉపాధ్యాయుడు హన్మయ్య

కొడంగల్, ఏప్రిల్ 7: మండల పరిధిలోని సంగాయిపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు హన్మయ్య విద్యారంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా సంగమం కళావేదిక ఉగాది వేడుకను పురస్కరించుకొని పురస్కారాన్ని అందజేసింది. సోమవారం హైదరాబాద్ లోని లక్డీకాపూల్ సెంట్రల్ కోర్టు హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హన్మయ్యకు ప్రముఖ నటుడు, ఆధ్మాత్మికవేత్త , రచయిత తనికెళ్ల భరణి, నటి వై.విజయం,సంగమం సంస్థ చైర్మన్ హర్షవర్దన్‌ల చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఉద్యోగరీత్యా హైదరాబాద్ లోని మల్కాజిగిరి ఉన్నత పాఠశాలలో ప్రాధానోపాధ్యాయులుగా విధులు నిర్వర్తించే క్రమంలో పాఠశాలలోని విద్యార్థులకు బెంచీలు, ల్యాబ్ సౌకర్యాలను ఏర్పాటు చేయడంతో పాటు బీద విద్యార్థుల చదువులకు సహాయం చేశారు. ఉద్యోగ విరమణ పొందిన తరువాత వచ్చిన డబ్బుల్లో రూ. 25లక్షలు వెచ్చించి స్వగ్రామం సంగాయిపల్లిలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణం, పేద విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనే విధంగా గ్రామంలో రూ.40లక్షలు వెచ్చించి ప్రత్యేకంగా లైబ్రరీని ఏర్పాటు చేశారు. ఇందుకు గాను ఆయన సేవలను గుర్తించిన సంగమం సంస్థ ఉగాది వేడుకను పురస్కరించుకొని సన్మానించింది.

## అక్రమ ఇసుక రవాణాను ఆపాలంటూ వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 7 : మండల వ్యాప్తంగా జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను ఆపాలంటూ తహసీల్దార్ పద్మావతికి ప్రజాసంఘాల నాయకులు వెంకటయ్య, బుస్స చంద్రయ్య, అబ్దుల్ వాహబ్, కె చంద్రయ్య వినతిపత్రం అందించారు. కాగ్నావాగు నుంచి అక్రమ ఇసుక తరలింపును ఆపడంతోపాటు అందుకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం, అంబేద్కర్ సంఘం, ఎస్సీ,ఎస్‌టీ,బీసీ మైనార్టీ ప్రజాసంఘాల అధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. మండలంలో కొన్ని నెలలుగా ఇసుక అక్రమ రవాణా విచ్చలవిడిగా కొనసాగుతుందని ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. వాగులో నుండి ఇసుకను తరలించడం ద్వారా భూగర్భ జలాలు తగ్గిపోయి వ్యవసాయ పంటలు ఎండిపోతున్నాయన్నారు.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి ఇసుక తరలింపునకు సహకరించిన బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్తాఫా, రత్నం,మల్లప్ప,బలప్ప,తుల్జనాయక్, నరేందర్, వెంకటయ్య, నర్సింహ పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ




ధారూరు, ఏప్రిల్ 7: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశానుసారం మండల నాయకులు పంపిణీ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసా య మార్కెట్ కమిటీ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు రూ, 9,01, 500/–విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్య క్షుడు మాన్‌సింగ్, ఏఎంసీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్ అశోక్‌కుమార్, నాయకులు బాబఖాన్, ముజఫర్, అమర్నథ్ పటేల్, జాకీర్, అంజయ్య, లాల్ మహమ్మద్, వెంకటేశ్ ఉన్నారు.

## గురుకుల పాఠశాలకు 8 మంది విద్యార్థుల ఎంపిక

మర్పల్లి, ఏప్రిల్ 7: తెలంగాణ గురుకుల పాఠశాలకు 8 మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం కేశవులు తెలిపారు.. మండలంలోని పంచలింగాల్ యూపీఎస్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశం కోసం ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలో పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం కేశవులు తెలిపారు.. గురుకుల పాఠశాలకు ఎంపికైన హాన్సిక, వరుణ్, సారిక, శ్రీనిధి, అఖిల, శైలజ తోపాటు మరో ఇద్దరిని ఉపాధ్యాయులు, పాఠశాల చైర్మన్, తల్లిదండ్రులు అభినందించారు.

## గుర్తుతెలియని మహిళ మృతి

వికారాబాద్, ఏప్రిల్ 7 : వికారాబాద్ జిల్లా కేంద్రంలో మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒక గుర్తు తెలియని మహిళ వికారాబాద్ మున్సిపల్ కార్యాలయం సమీపంలో చనిపోయి ఉందని స్థానికులు తెలిపారు. సమాచారం మేరకు వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గుర్తు తెలియని మహిళకు ఎడమ చెయ్యి లేదు.. ఆ మహిళ గురించి ఏమైనా సమాచారం తెలిస్తే వికారాబాద్ పోలీస్ స్టేషన్ సీఐ ఈ ఫోన్ 8712670030 ,8712670031 లకు సమాచారం తెలుపాలని పేర్కొన్నారు.

## రెండు బైకులు ఢీ
## ఓ వ్యక్తి మృతి

ధారూరు, ఏప్రిల్ 7: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన సంఘటన ధారూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సోమవారం ధారూరు ఎస్ఐ అనిత తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి. ధారూరు మండల పరిధిలోని ఎబ్బనూరు చెరువు సమీపంలో మండల పరిధిలోని రుద్రా రం గ్రామానికి చెందిన కంది శ్రీనివాస్ (39) పని నిమిత్తం వికారాబాద్‌కు బైక్ పై వెళుతుండగా ఎబ్బనూరు చెరువు సమీపంలో ఎదురుగా వస్తున్న ధారూరు మండలం గట్టేపల్లి గ్రామానికి చెందిన చింతకుంట నరసింహులు అనే వ్యక్తి స్పెండర్ బైక్ పై అతివేగంగా వచ్చి ఢీ కొట్టడంతో కంది శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ సూచన మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్ లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలిస్తుండగా రాత్రి 10;00ల సమ యం లో మతి చెందాడు. కేసు నమోదు చేయ చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిత తెలిపారు.

## ప్రభుత్వ భూమి కబ్జాచేస్తే
## కఠిన చర్యలు

మర్పల్లి, ఏప్రిల్ 7:ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ మునీరొద్దీన్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని పట్లూర్ గ్రామంలోని 248 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు.. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలోని ప్రభుత్వ భూమి ఎక్కడైనా కబ్జాచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.. పట్లూర్ గ్రామంలోని 248 సర్వే నంబర్‌లో కొందరు వ్యక్తులు ప్ర భుత్వ భూమిలో కడీలు పాతినట్లు తెలిసిందని అక్కడకు వెళ్లి పరిశీలించి ప్రభుత్వ భూమిగా గుర్తించి కడిలను తొలగించామన్నారు.. ఆయన వెంట ఆర్ఐ వెంకటేశం ఉన్నారు

## వ్యవసాయ పరిశోధనా కేంద్రం సందర్శన



బొంరాస్‌పేట్, మార్చి 7: జడ్పీ ఉన్నత పాఠశాలవిద్యార్థులు సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా పాలెం వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని సందర్శించినట్లు విద్యాధికారి హరిలాల్ తెలిపారు. పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులను ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా పాలెం వ్యవసాయ పరిశో ధనా కేంద్రానికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్కడి నుంచి సోమశిల ప్రాజెక్టును సందర్శించి ఆనకట్ట నిర్మాణం,నీటి సామర్థ్యం,సాగునీరు అందించే విధానం వంటి అంశాలను విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాకారం చంద్రశేఖర్, ప్రశాంత్, హరికాంత్, కాశయ్య, రమేశ్, భవాని, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## మూత పడిన పాఠశాలను తెరిపించాలని వినతి



గట్టిగానితండాలో మూతపడిన పాఠశాల.

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 7 : బొంరాస్‌పేట్ మండలం గట్టిగానితండా గ్రామపంచాయతీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గత ఏడాది నుంచి మూతపడింది. విద్యార్థులు పాఠశాలకు రావడంలేదనే కారణంతో మూతపడింది. ఈ విద్యాసంవత్సరం అయిన పాఠశాలను తెరచి విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారని తండావాసులు ఎదురు చూశారు. కాని అనుకున్నది కాలేదు. విద్యార్థులు చదువుకునేందుకు బొంరాస్‌పేట్,ముద్దాయిపేట్, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా ఒక టీచర్‌ను ఏర్పాటుచేసి పాఠశాలను తెరిపించాలని తండాప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలను తెరిపించి విద్యార్థులకు చదువు చెప్పాలని తాండవాసులు కోరారు



ధారూరు, ఏప్రిల్ 7: తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ సెంట్రల్ ఫోరం డైరీ, క్యాలెండర్‌ను సోమవారం ధారూరు ఎంపీడీవో నర్సింహులు, ఎంపీవో షఫీవుల్లా ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా టీపీఎస్‌సీఎఫ్ అధ్యక్షుడు మధుకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్‌విహార్, ధారూరు మండల పంచాయతీ కార్యదర్శులు ఆరీఫ్ ఖాన్, దేవేందర్, శివ సాయి రాఘవ, వెంకటయ్య, కిషన్, గణేష్, కృష్ణ, సుమలత, మమత, తిరుపతి, యోగిత, సునీత, స్పందన, ప్రసన్న , తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్
### నలుగురు సభ్యుల ముఠా అరెస్ట్

బేగంపేట్ ఏప్రిల్ 7: సన్ రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్ల మధ్య జరిగిన ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌కు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను సోమవారం సికింద్రాబాద్ సౌత్ జోన్ టాస్క్ ఫోర్స్, మహంకాళి పోలీసులు సంయుక్తంగా బెట్టింగ్‌కు పాల్పతున్న నిర్వాహకులను అరెస్ట్ చేశారు. బెట్టింగ్‌రాయుళ్ల వద్ద నుంచి రూ.92 ,120 నగదు, నాలుగు ఖరీదైన సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన సందీప్ (30) ఎలక్ట్రిక్రల్ వ్యాపారి సికింద్రాబాద్ లాలాగూడలో ఉంటూ న్యూఢిల్లీలోని ఆడెంతో కలిసి క్రికెట్ బుకీని నిర్వహిస్తున్నాడు, మరో ముగ్గురు గోషా మహల్ చెందిన సదానంద్ అభిషేక్ కుమార్ ప్రైవేట్ ఉద్యోగి (31), మంగళ హార్ట్ కు చెందిన పద్మవర్ యశ్వంత్ (32) కార్ మెకానిక్, మంగళహార్ట్‌కు చెందిన మరో వ్యక్తి గంగారాం(32) రియల్ ఎస్టేట్ వ్యాపారి వీరంత కలిసి ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న రాణిగంజ్ పాన్ బజార్ వారి సెంటర్ పై దాడి చేశారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఢిల్లీ కేంద్రంగా ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ సాగిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు.

## మ్యాట్రిమోనియల్ సైట్స్ వేదికగా మోసం

బంజారాహిల్స్, ఏప్రిల్ 7: పదేళ్లుగా పెళ్లిళ్ల పేరుతో మ్యాట్రిమోనియల్ సైట్స్ వేదికగా యువతులకు వలవేసి డబ్బులు దండుకుని జైలు పాలైన ఘరానా మోసగాడి లీలలు మరిన్ని వెలుగులోకి వచ్చాయి. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ఒక వైద్యురాలికి షాదీ డాట్ కామ్‌లో పరిచయమై రూ .10.84 లక్షలు దండుకున్న ఘటనలో అరెస్ట్ అయిన రాజమండ్రికి చెందిన జోగాడ వంశీ కృష్ణ అలియాస్ హర్ష చెరుకూరి (33)ను ఐదు రోజుల కస్టడీకి తీసుకుని విచారించారు. మరిన్ని విషయాలు బయటకు వచ్చాయి. యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఫొటోను తన ప్రొఫైల్ పిక్చర్ గా పెట్టుకుని అనేకమంది యువతులను బురిడీ కొట్టించినట్లు తేలింది. వంశీకృష్ణ గతంలో కాకినాడలో చదువుకున్న సమయంలో అదే కాలేజీలో సీనియర్ గా ఉన్న గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌తో పరిచయం ఉండడంతో అతడి ఫొటోను సోషల్ మీడియాలో వాడుకుని మొత్తం 26 మంది యువతులను మోసగించినట్లు విచారణలో తేలింది. 2016 నుంచి సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉన్న వంశీ కృష్ణ గత కొన్నేళ్లుగా షాదీడాట్ కామ్‌లోకి వచ్చి మోసాలు ప్రారంభించాడు అని గుర్తించాడు. యువతుల వద్ద నుంచి వివిధ కారణాలతో డబ్బులు వసూలు చేయడం.. వచ్చిన డబ్బులతో బెంగళూరులో గుర్రపు పందాలు.. గోవాలో క్యాసినోలో విచ్చలవిడిగా ఖర్చు చేసినట్లు తేలింది. తన మోసాల కోసం ప్రత్యేకంగా మూడు సిమ్ కార్డులు స్నేహితుల పేర్లతో తీసుకున్నాడని గుర్తించిన పోలీసులు మరింత లోతుగా విచారణకు సిద్ధం అవుతున్నారు.

## మొగులయ్య హత్య కేసులో అల్లుడే నిందితుడు



హత్యకు పాల్పడ్డ మల్లేశ్‌ను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

దోమ, ఏప్రిల్ 7: దోమ పోలీస్‌స్టేషన్ పరిదిలోని ఖమ్మంనాచారం గ్రామానికి చెందిన బోయిని మొగులయ్య(60) హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు మోత్కూర్ గ్రామానికి చెందిన ఎడ్ల మల్లేష్ మేస్త్రీ పని చేస్తూ జీవనం గడిపేవాడు. మల్లేశ్ అతని భార్య దాంపత్య జీవితంలో చిన్న చిన్న గొడవలు పడేవారు.ఒక రోజు ఇద్దరి మధ్య గొడవ జరిగి మల్లేశ్ భార్య తల్లిగారి ఊరైన ఖమ్మనాచారం వెళ్లింది.అప్పుడు మృతుడు మామ మొగులయ్య సర్ది చెప్పి ఆమెను అత్తగారింటికి పంపాడు. మరలా కొన్నాళ్లకు ఇద్దరి మధ్య గొడవ జరగగా మామ మొగులయ్య మల్లేష్ భార్యను ఖమ్మంనాచారం గ్రామానికి తీసుకువెళ్లి తిరిగి ఆమెను పంపలేదు. మూడు నెలలుగా మల్లేష్ ఒక్కడే నివాసం ఉం టున్నాడు. దీనితో నేరస్తుడు మామపై పగ పెంచుకొని చంపాలని నిర్ణయించుకున్నాడు. మల్లేశ్ శనివారం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో పొలంలో గల గుడిసెలో ఉన్న గొడ్డలి తీసుకొని ఆవుల షెడ్డులో నిద్రిస్తున్న మామ మొగులయ్యను తలపై ముఖంపై గొడ్డలితో కిరాతకంగా నరికి చంపాడు. ఆ గొడ్డలిని తీసుకొని పారిపోతూ మార్గ మద్యంలో పొదల్లో పారేశాడు. గొడ్డలిని స్వాధీనం చేసుకొని మల్లేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిస్తున్నట్లు పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, దోమ ఎస్సై నాగేందర్‌లు తెలిపారు.

## వాహనాల తనిఖీ..13 వాహనాలు సీజ్



నవాబుపేట, ఏప్రిల్7: వాహనాలను జాగ్రత్తగా నడుపాలని, మీ కోసం కుటుంబం మొత్తం ఎదురు చూస్తుంటదని గుర్తుంచుకోవాలని నవాబుపేట ఎస్ఐ అరుణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మైతాబ్‌ఖాన్ గూడ ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీని చేపట్టారు. తాగి వాహనం నడిపితే జరిగే పరిణామాలపై వాహనాదారులకు అవగాహన కల్పించారు. తనిఖీల్లో 13 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962